రోడ్డును బాగు చేయండి



పాడైపోయిన రోడ్డును చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్: ఎమ్మిగనూరు రోడ్డు నుంచి వయా కపటి, పెద్దకడబూరుకు వెళ్లే ప్రధాన రోడ్డును బాగు చేయాలని కపటి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నాయకులు నాయక్, సత్యనారాయణ, దేవదాసు, వడ్డే కృష్ణ, నాయక్ వీరేష్, కొండ్ల సుధ తదితరులు అధ్వానంగా ఉన్న రహదారిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఆదోని–ఎమ్మిగనూరు ప్రధాన రహదారి అడ్డు రోడ్డు నుంచి కపటి రోడ్డు పూర్తిగా గుంతలమయమై కనీసం మోటార్ సైకిళ్లు కూడా నడపలేని పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పి ఏడు నెలలైనప్పటికీ ఇప్పటివరకు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గర్భిణులు, బాలింతలను, ఆస్పత్రి నిమిత్తం తరలించేందుకు ఎంతో వ్యయప్రయాసాలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఆదోని క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విట్టా రమేష్ తదితరులు

ఆదోని అర్బన్: స్థానిక లీలా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న టి.వాగీశ శంకర్‌రెడ్డి కర్నూలు జిల్లా అండర్–12 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కడపలో జరిగే అండర్–12 ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రికెట్ జట్టు తరఫున ఆడనున్నాడు. ఈ మేరకు శనివారం ఆదోని క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విట్టా రమేష్, వైస్ ప్రెసిడెంట్ ముజీబ్, సెక్రటరీ వెంకటేష్, కోచ్ బాలాజీరావు క్రీడాకారుడు వాగీశా శంకర్‌ను అభినందించారు.

మహారథోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్న నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 15న రథోత్సవం సందర్భంగా వేలాది మంది తరలిరానుండటంతో పోలీసు బందోబస్తుపై డీఎస్పీ ఉపేంద్రబాబుతో చర్చించారు. అదేవిధంగా మున్సిపల్,విద్యుత్, దేవాదాయ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సీఐలు శ్రీనివాసులు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలతో పాటు బాలుర కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి, ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రావు, హెచ్‌ఎంలు చిత్రలేఖ, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

ఆదోని సెంట్రల్: రాజకీయాలకు అతీతంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ మధుసూదన్ సూచించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పురపాలక చైర్ పర్సన్ శాంతి, కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న, అధ్యాపకులు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నందవరం : ఇంటర్మీడియెట్ విద్యార్థులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి రఘునాథ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో జూనియర్ కాలేజీలో ఎంఈఓ–2 మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

క్రీడామైదానంలో నిర్మాణాలను నిలిపివేయాలి

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గదుల నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన క్రీడామైదానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం నిర్మిస్తున్న గదుల నిర్మాణాన్ని తాము స్వాగతిస్తామన్నారు. అయితే చాలా స్థలం ఉన్నప్పటికీ విద్యార్థులు ఆడుకునే స్థలంలోనే కట్టడానికి పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, వినతిపత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులకు సమర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు దేవదాసు, విల్సన్, మద్దిలేటి, సతీష్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆదోని సెంట్రల్: పురపాలక పాఠశాలల్లో ఎస్‌జీటీలుగా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను శనివారం ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, వీరచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న ఎమ్.గురుస్వామి, బి.రాముడు, లాల్ గఫూర్, బి.శ్రీదేవి పదోన్నతులు పొందడం అభినందనీయమన్నారు.

వెలుగులు నింపిన మహనీయుడు బ్రెయిలీ



మాట్లాడుతున్న ఉప విద్యాధికారి వెంకట రమణారెడ్డి

ఆదోని సెంట్రల్: అంధ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఉప విద్యాధికారి వెంకట రమణారెడ్డి కొనియాడారు. పట్టణంలోని భవిత కేంద్రంలో బ్రెయిలీ 217వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ నాలుగవ ఏటనే ప్రమాదావశాత్తు రెండు కళ్లు పోగొట్టుకొని నిరాశ చెందకుండా తన చదువును కొనసాగించాడని తెలిపారు. చదువు కోసం అంధ విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని సులభంగా అర్థం చేసుకోవడానికి చుక్కల చదువును కనుగొన్నాడన్నారు. తల్లిదండ్రులు గమనించి దివ్యాంగులైన పిల్లలను బడికి పంపి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ –2 శ్రీనివాసులు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం నిర్మలమ్మ, విజయలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రి ఎర్లీ ఇంటర్వెన్షన్ పరమేష్, భవిత కేంద్రం సిబ్బంది శాంత కుమార్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకువెళ్లాలి

ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి వైకల్యాన్ని జయించాలని ఎంఈఓలు మధుసూదన్‌రావు, ఆంజినేయులు, మల్లెల గ్రూప్ అధినేత ఆల్‌ఫ్రెడ్‌రాజు సూచించారు. శనివారం పట్టణంలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి దివ్యాంగులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఎఫ్ అధ్యక్షుడు నాగరాజు, బ్లైండ్ అసోసియేషన్ అధ్యక్షుడు మారెప్ప, బాలికల హైస్కూల్ ఉపధ్యాయురాలు విజయలలిత, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాత పరీక్షకు సర్వం సిద్ధం

ఆదోని రూరల్: రేషన్ డీలర్ల రాత పరీక్షకు సర్వం సిద్ధం చేశామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని డివిజన్‌లో 78 డీలర్ల నియామకం కోసం 512 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో సరైన పత్రాలు లేనందున 40 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే డీలర్ల రాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు ఒరిజినల్ హాల్ టికెట్, ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలైన మొబైల్ ఫోన్‌లు, గడియారం, క్యాలిక్యులేటర్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష సమయం ఉదయ 10 నుంచి 11.30 గంటల వరకు ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల్లోపు పరీక్ష కేంద్రంలో ఉండేలా అభ్యర్థులు చూసుకోవాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్, కామ విద్యార్థులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, క్రాంతికుమార్, నాక్ కోఆర్డినేటర్ పాల్‌దేవదానం పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏపీ.వీరన్న అధ్వర్యంలో నూతన సంవత్సరం డైరీ– క్యాలెండర్లను ఎస్‌బీఐ మేనేజర్ రవికళాధర్‌శర్మ ఆవిష్కరించారు. సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు అబ్దుల్‌కరీం, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్‌తో ప్రణయ్‌కుమార్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థి ప్రణయ్‌కుమార్ రెడ్డి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. శనివారం కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. విద్యార్థి తయారు ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ విధానంతో విద్యుత్‌ను ఎలా ఆదా చేయవచ్చో వివరించాడు. విద్యార్థిని, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అధ్యాపకులు మోహన్ బాబు, సాయి కుమారిలను ప్రిన్సిపాల్, అధ్యాపకబృందం అభినందించారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి జి.అర్చన

ఆదోని రూరల్: సీనియర్ సిటిజన్లు చట్టాల గురించి తెలుసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పెన్షన్ భవనంలో సీనియర్ సిటిజన్లకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె వారికి గల హక్కులను తెలియజేశారు. అనంతరం సీనియర్ సిటీజన్‌లు తమ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో టూ, త్రీ టౌన్ సీఐలు సూర్యమోహన్, రామలింగయ్య, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, న్యాయవాదులు లోకేష్‌కుమార్, కళ్యాణ్‌రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, కార్యదర్శి కె.ఈరన్న పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: బాలిక విద్యను ప్రోత్సహించడంలో సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప, అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆదోని, కౌతాళం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఎస్టీయూ భవనంలో శనివారం సన్మానించారు. వారు మాట్లాడుతూ సామాజిక రుగ్మతలైన బాల్య వివాహాలు, వితంతు వివాహాలు రూపు మాపడంలో ఆమె చేసిన సావిత్రీబాయి చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ మహిళా నాయకురాళ్లు నాగలక్ష్మి, అరుణజ్యోతి, భవాని, సుజాత, అనిత, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సత్కారం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శనివారం ఉపాధ్యాయినులను సత్కరించారు. అంతకు మునుపు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి ఎస్టీయూ మహిళా కన్వీనర్ లక్ష్మీదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ప్రసన్నరాజు, బసవరాజులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు లక్ష్మీదేవి, రామలింగమ్మ, ప్రమీల, అరుణాబాయ్, లలితమ్మ, గాయిత్రి, ఎస్టీయూ నాయకులు బాబయ్య, అడివన్న, ఎల్లప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో తాత్కాలిక అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ గిర్వాణీ శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. కాలేజీలో సంస్కృతం, భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం, వ్యాయామ అధ్యాపకులు, లైబ్రరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోపు కాలేజీలో దరఖాస్తు అందజేయాలన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

నందవరం : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) సభ్యులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి–1 సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ముగతి గ్రామంలో ఎంపీపీ తెలుగు మెయిన్ స్కూల్ ఎస్ఎంసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎంసీ సభ్యులు పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజనం తనిఖీలు వంటి వాటిని పరిశీలించాలన్నారు.



ఎమ్మిగనూరు.. వ్యాపారాల్లో జోరు.!

- అందుబాటులో మెరుగైన విద్య, వైద్యం.
- చేనేతకు ప్రధాన కేంద్రం
- విస్తరించిన రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాలు

ఎమ్మిగనూరు: సామాజిక చైతన్యం..చేనేతల కళా నైపుణ్యాలతో ఎమ్మిగనూరు పట్టణంలో వ్యాపార రంగం విస్తరించింది. విద్యా, వైద్యరంగాలతో పాటు రియల్ ఎస్టేట్ రంగం అంచలంచెలుగా విస్తరించడంతో పట్టణంలో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.

నేతన్న నైపుణ్యానికి నిదర్శనం

జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఎమ్మిగనూరుకు విశిష్ట స్థానం ఉంది. వేగంగా విస్తరించి వ్యాపార రంగాల్లో పరుగులు పెడుతున్న పట్టణం ఎమ్మిగనూరు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజక వర్గాల కు ప్రధాన వ్యాపార కేంద్రం ఎమ్మిగనూరే కావడం విశేషం. పట్టణ జనాభా 1.2 లక్షలు. ఎమ్మిగనూరు ముఖ్యంగా చేనేతలు, వ్యాపారులతోపాటు ఉద్యోగస్తులు అధికంగా ఉండే ప్రాంతంగా మారింది.

సోమప్ప స్ఫూర్తితో..

చేనేత పితామహుడు, పద్మశ్రీ మాచాని సోమప్ప స్ఫూర్తితో ఇక్కడ చేనేత అనుబంధం రంగాలతో పాటు వివిధ వ్యాపార రంగాలు వృద్ధిలోకి వచ్చాయి. పత్తి జిన్నింగ్–స్పిన్నింగ్ మిల్లులతో మొదలు నూలు, పట్టువస్త్రాల నేతతో ఎమ్మిగనూరుకు చేనేతకు విశిష్టస్థానం ఉంది. ఎమ్మిగనూరు వీవర్స్ సొసైటీ ద్వారా తయారు చేసే నూలు దుస్తులు, దుప్పట్లు, చేతి రుమాళ్లకు వివిధ రాష్ట్రాల్లో డిమాండ్ అధికం. సుమారు 5వేల మందికిపైగా చేనేత రంగంలో వ్యాపారాలను సాగిస్తున్నారు.

మెరుగైన విద్య

ఎమ్మిగనూరు పట్టణం విద్యారంగానికి పెట్టింది పేరు. ఇక్కడ ప్రభుత్వ, ప్రవేట్ స్కూళ్లతో పాటు కార్పొరేట్ కళాశాలలు, బీఎడ్–డీఎడ్ కళాశాలలు, ఇంజినీరింగ్, ఐటీఐ కళాశాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం, గురుకుల పాఠశాలలు, వెటర్నరీ, అగ్రికల్చర్ డిప్లొమో కళాశాలలు ఉన్నాయి. నవోదయ, సైనిక స్కూళ్ల ప్రవేశాలకు విరివిగా కోచింగ్ సెంటర్లు, టెట్, డీఎస్సీ కోచింగ్‌లతో పాటు గ్రూప్స్‌కు కోచింగ్‌లలో ఎమ్మిగనూరు అగ్రస్థానంలో నిలిచింది.

వైద్య రంగంలో విశేష సేవలు..



పట్టణంలో వైద్యరంగంలో విశేష సేవలు అందుతున్నాయి. పట్టణంలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. శక్తి, శిల్పా, కార్తీక్, రేఖా, ధీరజ్, ఆర్‌కే, ఆర్వీ వంటి మల్టిలెవల్ నర్సింగ్ హోములు 20కిపైగా ఉన్నాయి. ముఖ్యంగా ఆర్థో, గైనిక్, జనరల్ ఫిజీషియన్, డెంటల్, కంటివైద్య సేవలు బాగా విస్తరించాయి. కర్నూలు, హైదరాబాద్ లాంటి చోట లభించే వైద్యసేవలు స్థానికంగా అందుబాటులోకి వచ్చాయి. అల్లోపతితో పాటు ఆయుర్వేద, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉండటం విశేషం.

వ్యవసాయ రంగం..

తుంగభద్ర నది, దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, పులికనుమ–గురురాఘవేంద్ర ప్రాజెక్టుల ద్వారా సాగునీరు పుష్కలంగా లభిస్తుండటంతో వ్యవసాయ రంగం మరింత వృద్ధిలోకి వచ్చింది. వరి, పత్తి, వేరుశనగ మిల్లులు వెలిశాయి. జిల్లాలో వేరుశనగ పంట విక్రయాలకు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ ప్రధానం. ఇక్కడ భూసార పరీక్షా కేంద్రం, విత్తన పరిశోధన క్షేత్రం, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఆబోతుల వీర్యోత్పత్తి కేంద్రం, మేలుజాతి మేకల వీర్యోత్పత్తి కేంద్రాలు ఉండటంతో వ్యవసాయం, పాడి పరిశ్రమ మరింత వృద్ధిలోకి వచ్చింది. ప్రతిఏటా 18వేల హెక్టార్లల్లో రైతులు పంటలను పండిస్తున్నారు.

నలువైపులా రియల్ ఎస్టేట్

ఎమ్మిగనూరులో గత 20 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం బాగా పుంజుకుంది. ఉద్యోగులు, వ్యాపారులు అధికంగా ఉండటంతో రియల్ ఎస్టేట్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ రంగాల్లో పెట్టుబడులు పెరిగాయి. విరివిగా లే అవుట్, నాన్ లే అవుట్ వెంచర్లు, అపార్ట్‌మెంట్‌లు రూపుదిద్దుకున్నాయి. బళ్లారి–రాయచూరు 165 నేషనల్ హైవే, సమీపానాన మంత్రాలయ రాఘవేంద్రస్వామి క్షేత్రం ఉండటంతో రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిలోకి వచ్చింది.

విస్తరించిన ఆటో మొబైల్ రంగం..



బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలు విస్తరించటంతో టూవీలర్ మొదలు ఫోర్ వీలర్ వరకూ వ్యాపారం విస్తరించింది. కర్నూలు, ఆదోని లాంటి పట్టణాలకు వెళ్లకుండా స్థానికంగానే బజాజ్, హోండా, హీరో, యమహా, సుజికీ వంటి టూ వీలర్ షోరూంలు ఏర్పాటయ్యాయి. బ్యాంక్‌లు విరివిగా లోన్లు ఇవ్వటం, ఫైనాన్స్ కంపెనీలు ఈఎంఐ విధానంలో ఫైనాన్స్ చేస్తుండటంతో టూ వీలర్‌ల కొనుగోళ్లు బాగా పెరిగిపోయాయి. అలాగే కార్పొరేట్ వ్యాపారాలు స్మార్ట్ బజార్, మోర్, ట్రెండ్స్, ట్వీల్స్, విశాల్ మార్ట్‌లు విస్తరించి ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయి.